విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 06,అక్టోబర్ 2023

వందే భారత్ రైలు ను గుంతకల్ జంక్షన్ మీదుగా నడపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డీ.జగదీష్

విశాలాంధ్ర బ్యూరో – అనంతపురం : వందే భారత్ రైల్ ను గుంతకల్లు రైల్వే జంక్షన్ మీదుగా నడపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆపార్టీ నాయకులతో కలసి గుంతకల్ రైల్వే డిఆర్ఎం మనీష్ అగర్వాల్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే జంక్షన్ నుండి ప్రతిరోజు సుమారు 10 వేల మందికి పైగా ప్రయాణికులు ఆయా రైళ్ళలో ప్రయాణం చేస్తున్నారని స్పష్టం చేశారు. ప్రయాణికుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని గుంతకల్ రైల్వే జంక్షన్ లో వందే భారత్ రైల్ ను ఆపాలన్నారు. అదేవిధంగా కాచిగూడ నుండి యశ్వంతపూర్ వెళ్ళే వందే భారత్ రైలు గుంతకల్ జంక్షన్ మీదుగా తిరిగేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు.కరోనా సమయంలో రద్దు చేసిన బెంగళూరు,విజయవాడ ప్యాసింజర్ ట్రైన్ ను పునః ప్రారంభించాలన్నారు. గుంతకల్ రైల్వే హాస్పిటల్ లో డయాలసిస్ వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్లో ఎక్సలేటర్ను ఏర్పాటు చేయాలన్నారు.ఆ క్రమంలోనే తుంగభద్ర ఎక్స్ ప్రెస్ సికింద్రాబాద్ నుండి కర్నూలుకు మాత్రమే పరిమితం కాకుండా గుంతకల్ వరకు పొడిగించాలన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి మహేష్,పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్,సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర ,ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి సురేష్,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, ప్రజానాట్యమండలి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్,పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతును పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర – యాడికి : యాడికి మండల పరిధిలోని లక్షుంపల్లి గ్రామంలో బాధిత రైతు బోయ కుమార్ ను తాడపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గురువారం పరామర్శించారు. బోయ కుమార్ కు చెందిన సుమారు 174 అరటి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేయడం జరిగిందని తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం అరటి తోటను పరిశీలించారు రైతుకు అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇస్తూ 50 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మనాభరెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటరామిరెడ్డి, రాయల చెరువు వైసిపి నాయకుడు తలారి నాగేష్, తూట్రాళ్లపల్లి సర్పంచ్ సంజీవ రాయుడు, తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖకు ఎన్నికలు

విశాలాంధ్ర – అనంతపురం వైద్యం :ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అనంతపురం జిల్లా శాఖ నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమం ఈ నెల 6,7వ తేదీలలో జరుగుతుందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్నికల అధికారిగా జిల్లా హడహాక్ కమిటీ నిర్ణయం మేరకు జయరామ్ వ్యవహరిస్తారు. రాష్ట్ర కమిటీ నుంచి పరిశీలకులుగా కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఈ.ఎన్.రాజు, ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కే.నాగరాజు లను నియమించడం జరిగిందన్నారు. అనంతపురంలోని రుద్రంపేట బైపాస్ వద్ద గల వాల్మీకి కళ్యాణ మండపంలో 6వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జిల్లా కమిటీలో వివిధ పదవులకు నామినేషన్ల స్వీకరణ,12 గంటల నుంచి 1 గంట వరకు నామినేషన్ల పరిశీలన,1.30 గంటల నుంచి 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఎన్నికలు అవసరం అయిన పదవులకు ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి 01 వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 02 గంటల నుంచి కౌంటింగ్ జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత విజేతలను ప్రకటించడం జరుగుతుందన్నారు. కావున యూనియన్ ఓటర్ లిస్ట్ లో ఓటు హక్కు ఉన్న ప్రతి సభ్యుడు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

ఉద్యాన శాఖాభివృద్ధి పనుల పరిశీలన

విశాలాంధ్ర–తాడిపత్రి: ఉద్యాన శాఖ పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల ను గురువారము ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యాన శాఖ కమీషనర్ కార్యాలయ సీనియర్ ఉద్యాన ఉప సంచాలకులు కె.శ్రీనివా సులు పరిశీలించారు. మొదట గా ఆయన అనంతపురం జిల్లాలోని తాడిపత్రి ఉద్యాన అధికారి పరిధిలో ఉద్యాన శాఖ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులు కలెక్షన్ సెంటర్స్, సోలార్ కోల్డ్ రూమ్స్, శీతల గిండగులు, కమ్యూనిటీ ఫార్మ్ ఫాండ్ వంటి పథకాలు పైన క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. అలాగే రైతులతో అభివృద్ధి పనులు పైన చర్చలు జరిపారు. ముచ్చుకోట గ్రామం నందు కొత్తగా మంచి అగ్రికల్చర్ ప్రాక్టీస్సెస్ పైన క్షేత్ర స్థాయి నందు ఇంప్లిమెంట్ చేయడానికి కావలిసిన పరిస్థితిలను రైతులుకి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహ రావు, ఉద్యాన అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర–గుడిబండ: మండలం పరిధిలో మోరబాగాల్ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం మండల ప్రత్యేక అధికారి ఎంపిడివో రామారావు, తహశీల్దర్ నాగభూషణ్,జెడ్పిటిసి భూతరాజు, ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందని, ఆ తర్వాత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యాన్ని, అందించారు.ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి నాగరాజు నాయక్, డాక్టర్లు సుకన్య ,ప్రేమ్ కుమార్, భారతి, శ్రీనివాస్ నాయక్, సర్పంచ్ తిప్పేస్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నూతన కన్వీనర్లకు సన్మానం

విశాలాంధ్ర–మడకశిర : ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన కన్వీనర్ లను ఎన్నిక చేసింది. ఇందులో భాగంగా పట్టణ అధ్యక్షులు పుట్టకామప్ప, మండల అధ్యక్షులు రామిరెడ్డిలను స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, వైకాపా నాయకులు ప్రజాప్రతినిధులు వీరికి గురువారం స్థానిక పట్టణంలోని ఆర్ అండ్ బి వసతి గృహంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ మీ మీద నమ్మకంతో పార్టీ అధిష్టానం మిమ్మల్ని మండల కన్వీనర్లుగా నియమించిందని దీనిని దృష్టిలో ఉంచుకొని ఇరువురు పార్టీ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని పేర్కొన్నారు.పట్టణ మరియు గ్రామాలలో ఎక్కడ ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని మండల అధ్యక్షులకు సూచించారు. అనంతరం వీరికి ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు.ఈ సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ కవితా సత్యనారాయణ,జడ్పిటిసి సరోజమ్మ గారి మూర్తి,స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు గౌడ్,మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీనరసింహ జయరాజ్,వైస్ చైర్మన్ లు రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

విశాలాంధ్ర – శెట్టూరు : మండలం పరిధిలో బచ్చేహల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు కార్యక్రమాన్ని గురువారం మండల ప్రత్యేక అధికారి డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య, తాహసిల్దార్ ఫణి కుమార్ జెడ్పిటిసి మంజునాథ్, ఇంచార్జ్ ఎంపీడీవో రఘురామారావు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందని, ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిలో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్యం గురించి ప్రభుత్వ అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత వైద్య శిబిరాల్లో పరీక్షలు చేసి అవసరమైన వారికి మెరుగైన వైద్యాన్ని అందిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కళావతి, ఎంపిటిసి నరసింహులు, డాక్టర్స్ పవన్ కుమార్, వేణు కార్తీక్, తరుణ్ సాయి, రాధా రాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాదమ్మా, పంచాయతీ కార్యదర్శి వ్యాసరావు,సచివాలయ సిబ్బంది, ఏ.ఎన్.ఎంలు.ఆశావర్కర్లు, వాలంటీర్లు. స్థానిక వైస్సార్సీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హలో మాదిగ చలో అలంపూర్

విశాలాంధ్ర–శింగనమల: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మహాజననేత మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ అలంపూర్ నుండి హైదరాబాద్ వరకు తలపెట్టిన పాదయాత్రను మాదిగ లందరూ విజయవంతం చేయాలని గురువారం సింగనమల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర గోడపత్రికలను ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు ఓబులేసు ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం ఎస్ పి జిల్లా కన్వీనర్ బండారు కదిరప్ప, సీనియర్ నాయకులు రంగాపురం పుల్లప్ప, సీనియర్ నాయకులు రేకలకుంట వెంకటేశు, హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో నార్పల రాజు, రెడ్డిపల్లి నగేష్, ఎంఎస్పి మండల అధ్యక్షులు శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బండారు నాగరాజు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రేకలకుంట రామాంజనేయులు, వెంకటేశులు, రెడ్డప్ప ,ఎమ్మెస్ ఎఫ్ బండారు శ్రీనివాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాతలు పెట్టిన టీచర్ ను సస్పెండ్ చేయాలి

విశాలాంధ్ర – జేఎన్టీయూఏ :అనంతపురం నగరంలో మూడవ డివిజన్ పరిధిలో డాక్టర్ రాజశేఖర్ రెడ్డి మున్సిపల్ స్కూల్ లో మూడవ తరగతి చదువుతున్న గోపేస్ అనే విద్యార్థినిని చావబాదిన టీచర్ భాగ్యలక్ష్మిని విధులనుంచి తొలగించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు తో కలిసి స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయి స్వామి మాట్లాడుతూ మూడవ తరగతి చదువుతున్న గోపేష్ అనే విద్యార్థి తన మిత్రులు అల్లరు చేస్తారనే సాకుతో తరగతి గదిలో ఉన్న తొమ్మిది మంది విద్యార్థులను బెత్తంతో కొట్టడంతో విద్యార్థులకు 9 వాతలు ఏర్పడేటట్టు కొట్టడం బాధాకరమన్నారు. విద్యార్థులు అల్లరు చేస్తే మందలించాల్సిన ఉపాధ్యాయులే వాతలు పడేటట్టు కొట్టడం మీకు ఎవరు హక్కు ఇచ్చారని ప్రశ్నించారు. ఈ ఘటన మొదటిసారి కాదు ఇప్పటికే మూడుసార్లు జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థులకు హెూం వర్క్ ఇవ్వకపోయినా తరగతులలో హ్యాండ్ రైటింగ్ సరిగా నేర్పించకపోయినా మీరు ఇంట్లో నేను హెూంవర్క్ ఇచ్చాను హ్యాండ్ రైటింగ్ బాగా రాపిస్తున్నాను అని మీ తల్లిదండ్రులకు చెప్పాలి లేదంటే మర్చంట్ రోజు మిమ్మల్ని కొడతాను అని విద్యార్థులను భయపెడుతున్న టీచర్ భాగ్యలక్ష్మిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్లో దగ్గర ధర్నా చేస్తున్న సందర్భంలో పక్కన తరగతులలో టీచర్ భాగ్యలక్ష్మి గారి గురించి విద్యార్థులను అడిగితే మూడో తరగతి విద్యార్థులు కాకుండా నాలుగో తరగతి ఐదవ తరగతి విద్యార్థులు కూడా టీచర్ మమ్మల్ని చేతులు వెనక్కి తిప్పి స్కేల్ తో డెస్టర్తో కొడుతుంది అని విద్యార్థులు వాపోయారు. తక్షణమే మూడో తరగతి చదువుతున్న గోపేష్ విద్యార్థిని మరియు అక్కడ చదువుతున్న విద్యార్థులను వాతలు పడేటట్టు చావు బాదిన భాగ్యలక్ష్మి మేడంను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన జరుగుతున్న సందర్భంలో అక్కడికి ఎంఈఓ వెంకటస్వామి గారు వచ్చి ఆ సంఘటనపై విచారణ జరిపి టీచర్ భాగ్యలక్ష్మి కి మందలించి రేపటి రోజున మెమో ఇష్యూ చేస్తామని ఎంఈఓ వెంకటస్వామి గారు తెలపడం జరిగింది. మేము ఇష్యూ చేయకుండా టీచర్ భాగ్యలక్ష్మి పై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తే ఎంఈఓ పైన ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ యాదవ్, వంశీ, నగర అధ్యక్షులు ఉమా, మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు చందు, మంజు, విశ్వనాథ్, నగర నాయకులు హరికృష్ణ, ఆనంద్, రారాజు, అశోక్, ఈశ్వనాథ్, కౌశిక్ పాల్గొన్నారు.

గొర్రెలు దొంగతనం చేసిన వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర–ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గం వజ్రకరూరు మండలం కమలపాడు గ్రామ సమీపంలో గత నెల 25వ తేదీ రాత్రి 7 గొర్రెలు దొంగతనా నికి గురయ్యాయని అక్కడ కాపలా ఉన్న వ్యక్తులు వెంకటేశు, సురేషు, రామప్ప, అనే వ్యక్తులు గొర్రెలను దొంగలించారని వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వజ్రకరూరు మండలం తట్రకల్లు గ్రామానికి చెందిన కురువ తిప్పయ్య, పందికుంట గ్రామానికి చెందిన రంగరాజులు గురువారం ఉరవకొండ సర్కిల్ ఇన్స్పెక్టర్ శేఖర్ కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ దొంగతనానికి సంబంధించి వజ్రకరూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఇదే విషయాన్ని వజ్రకరూరు పోలీసులు స్టేషన్ కి వారిని పిలిపించి విచారణ చేశారని తమపై ఎక్కడ కేసులు నమోదు అవుతాయోనని భయంతో దొంగతనం చేసిన వారు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు శరీరంపై గాయాలు చేసుకొని పోలీసులు విచక్షణ రహితంగా కొట్టినట్లు పోలీసులపైనే ఎదురుదాడి చేస్తున్నారని తెలిపారు. ఈ ముగ్గురు దొంగలకు వజ్రకరూరు మండలంలోని ప్రధాన ప్రత్యక్ష పార్టీకి చెందిన కొంతమంది నాయకులు మద్దతు తెలపడం శోచనీయమన్నారు. గతంలో కూడా వీరుపై ఇలాంటి దొంగతనాలకు పాల్పడినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. అందరూ కలిసి కూడా గొర్రెలు మేపుకునేవారమని ఆరోజు తమ ఇద్దరూ గొర్రెలు మేపడానికి వెళ్లకపోవడంతో మాకు సంబంధించిన గొర్రెలు మాత్రమే దొంగతనానికి గురయ్యాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి దొంగతనానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి తమ గొర్రెలను రికవరీ చేయాలని సీఐ కి విజ్ఞప్తి చేసినట్లు వారు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర – అనంతపురం : మాజీ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, మచ్చ లేని చంద్రుడుగా త్వరలోనే బయటికి వస్తారని అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆదేశాల మేరకు నగరంలో టిడిపి శ్రేణులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 23వ రోజు కొనసాగాయి. వి.ప్రభాకర్ చౌదరి, ఆయన సతీమణి వైకుంఠం విజయలక్ష్మి దీక్ష శిబిరానికి సాయంత్రం హాజరై సంఘీభావం తెలిపి నిమ్మరసం విరమింప చేశారు.చంద్రబాబు మచ్చలేని చంద్రునిగా బయటికి రావాలని కోరుతూ వైకుంఠం విజయలక్ష్మి మారుతి నగర్ లోని సాయిబాబా ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు త్వరలోనే ప్రజల్లోకి వస్తారని, ఆ దేవునితో పాటు ప్రజల ఆశీస్సులు ఆయనకు ఉన్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా చంద్రబాబు నాయుడుకు మద్దతు తెలుపుతున్నారని, ఎలాంటి అవినీతి చేయని బాబును అక్రమంగా అడ్డగోలుగా కేసులు పెట్టి, జైలుకు పంపారని, న్యాయమే గెలుస్తుందన్నారు. ఈరోజు దీక్షలో మాజీ కార్పొరేటర్లు నటేష్ చౌదరి, సంగా తేజస్విని, రాజారావు, టీడీపీ నాయకులు తదితరులు సంఘీభావం తెలిపారు.

సర్వజన వైద్యశాలలో సిరాలజి పరీక్షా కేంద్రం

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: ప్రభుత్వ సర్వజన వైద్యశాల లోని క్యాజువాలిటీ పైన ఉన్న రెండు గదులను సూక్ష్మజీవ శాస్త్ర విభాగానికి కేటాయించగా అందులో సిరాలజి పరీక్షల నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.ఈ గదిని సూపరింటెండెంట్ డాక్టర్ కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఆర్ ఎం ఓ లు డాక్టర్ పద్మజ,డాక్టర్ హేమలత, మైక్రోబయాలజీ హెచ్ ఓ డి ఆచార్య డాక్టర్ శాంతి రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మైక్రో బయాలజీ లోని సిరాలజీకి చెందిన అన్ని పరీక్షలను ఇక్కడే చేసి ఇక్కడే రిపోర్టులను కూడా వీలైనంత త్వరగా పేషెంట్లకు ఇవ్వడానికి అనువుగా ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, మైక్రో బయాలజీ డాక్టర్లు అద్భుతమైన పనితీరును కనబరుస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలను అందించాలని కోరారు. మైక్రో బయాలజీ హెచ్ ఓ డి డాక్టర్ శాంతి రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన వ్యాధి నిర్ధారణ పరీక్షలను చేసి రిపోర్టులను వీలైనంత తొందరగా పేషంట్లకు అందజేయడంలో మా వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైక్రో బయాలజీ డాక్టర్లు హైమావతి, వేముల సరోజ, మీనిగ శైలజ, ఉమాదేవి, చంద్రశేఖర్, ప్రవీణ, ప్రియాంక, రత్న హారిక, సునీల్ కుమార్, ఆదిరెడ్డి పరదేశి నాయుడు, అసిస్టెంట్ ఆర్ ఎం ఓ డాక్టర్ అభిషేక్, సీనియర్ రెసిడెంట్లు డాక్టర్ లలిత భవాని, దివ్య తేజ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లు సుమాంజలి, పాణిగ్రహి, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం : జిల్లా ఎస్పీ శ్రీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు అనంతపురం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పీవీకేకె డిగ్రీ, పి.జి కళాశా లలో గురువారం అవగా హన కార్యక్రమం నిర్వహిం చారు.ఈ సందర్భంగా అనంతపురం దిశ సి.ఐ చిన్న గోవిందు మాట్లాడారు. దిశ యాప్ డౌన్లోడ్ , రిజిస్ట్రేషన్, ఫోక్సో చట్టం, గుడ్ టచ్ ,బ్యాడ్ టచ్ , బాల్య వివాహాలు– అనర్థాలు, లైంగిక వేధింపులు, మహిళా రక్షణ చట్టాలు, 1098, సైబర్ నేరాలు, సోషల్ మీడియా అనర్థాలు, తదితర అంశాలపై అవగాహన చేశారు.సి.ఐ తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ మునికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్, దిశ క్లస్టర్ రజియా సుల్తానా, మహిళా కానిస్టేబుల్ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

సినిమా పక్కిలో దారి దోపిడి

విశాలాంధ్ర – కళ్యాణదుర్గం : జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలు, ఆటోలపై దారి దోపిడీ దొంగలు గురువారం తెల్లవారుజామున బీభత్సం సృష్టించారు. లారీలు , ఆటో డ్రైవర్ల పై దాడి చేసి వాహనాల అద్దాలు ధ్వంసం చేసి నగదు దోచుకెళ్లిన నిందితులను కళ్యాణదుర్గం,, రాయదుర్గం పోలీసులు చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. కళ్యాణదుర్గం డిఎస్పి శ్రీనివాసులు సంఘటన జరిగిన తీరును మీడియా సమక్షంలో వివరాలు వెల్లడించారు. మంగళవారం తెల్లవారుజాము రెండున్నర గంటల సమయంలో కళ్యాణదుర్గం – బళ్లారి హైవేపై ప్రయాణిస్తున్న రెండు లారీలను ఆపి వాటి అద్దాలను పగలగొట్టి వారి నుండి రూ.3120 నగదు దోచుకున్నా ధోగలు బీభత్సం సృష్టించినట్లు తెలిపారు. దొంగల ఆగడాలను ఎదుర్కోలేక లారీ యజమానులు డయల్ 100 కు ఫోన్ చేసినట్లు డిఎస్పి వెల్లడించారు. సమాచారం అందిన వెంటనే కళ్యాణదుర్గం రూరల్, రాయదుర్గం రూరల్ పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. రహదారికి ఇరువైపులా పోలీసులు దిబ్బంధం చేయడంతో నరసాపురం గ్రామానికి చెందిన పాలడుగు విష్ణువర్ధన్ , తొలిచూరి భరత్ , మాల తేజలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుండి నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసును చేదించినట్లు డిఎస్పి తెలిపారు. కేసు చేదించడంలో కృషిచేసిన కళ్యాణదుర్గం ఇన్చార్జి సర్కిల్ ఇన్స్పెక్టర్ యుగంధర్, ఎస్సై సుధాకర్ , పట్టణ రక్ష సిబ్బంది కృష్ణారెడ్డి , సురేంద్రబాబు , హెడ్ కానిస్టేబుల్ రవి, వెంకటేశ్వర్లు ను జిల్లా ఎస్పీ ప్రశంసించినట్లు డిఎస్పీ తెలిపారు.

ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్న ప్రభుత్వం

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం జగన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని మారుతి నగర్ లో ఉన్న కేశవరెడ్డి స్కూల్లో గురువారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి, స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ వసీం, తదితరులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉప మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, నగరపాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి, డీఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ డా.కిరణ్ కుమార్ రెడ్డి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిఐఓ యుగంధర్, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్రెడ్డి, నాయకులు అనంత చంద్రారెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్రెడ్డి, శ్రీదేవి, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, వీరా రామకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు రమాదేవి, అనిల్కుమార్రెడ్డి, సైఫుల్లాబేగ్, డాక్టర్ లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్ పంపిణీ

విశాలాంధ్ర–డి.హీరేహాళ్: మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎం పీడీవో భాస్కర్బాబు అధ్యక్షతన గురువారం గ్రామపంచాయతీ కార్యదర్శు లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల డిజిటలైజేషన్లో భాగంగా గ్రామ పంచాయతీకి వచ్చు అన్ని వనరులను కూడా క్యూఆర్ స్కానర్ ద్వారా నేరుగా గ్రామపంచాయతీ ఖాతాలకు జమ చేయు విధంగా ప్రభుత్వం ప్రారంభించారన్నారు. డిజిటలైజేషన్ ప్రకారము అందరూ గ్రామపంచాయతీ కార్యదర్శులకు పేటీఎం మిషన్లు మరియు టీఆర్ఎస్ స్కానర్లను ఎంపీడీవో భాస్కర్ బాబు మరియు ఈవాడి ఏ బలరామారావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు రాజు, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

చౌకధాన్యం బియ్యం పట్టివేత

విశాలాంధ్ర–రాప్తాడు: మండలంలోని మరూరు టోల్ గేట్ వద్ద ఈనెల 3వ తేదీన పట్టుకున్న చౌకధాన్యం బియ్యం వాహనాన్ని విజిలెన్స్ సీఐ రామారావు, ఎస్ఐ జి.జయపాల్ రెడ్డి, ఏఈఈ కుల్లాయి రెడ్డి, మండల రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ రవాణా చేస్తున్న 335 క్వింటాళ్ళ (640 బ్యాగులు) బియ్యాన్ని, ఏపీ21టీఈ–6488 నెంబర్ గల లారీని సీజ్ చేసి రాప్తాడు సీఎస్డీటీ జ్యోతికి అప్పగించారు. నిందితులైన బియ్యం యజమాని సుంకన్న, డ్రైవర్ బి.కాంతారావు, క్లీనర్ సుబ్బరాయుడు, వాహన యజమాని సుగాలి నరసమ్మ లపై రాప్తాడు పోలీసు స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదు చేయించామని సి ఎస్ డి టి జ్యోతి తెలిపారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర – కూడేరు : మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా జల్లిపల్లి గ్రామానికి చెందిన బైరెడ్డి రామచంద్రారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం అనంతపురం వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో కూడేరు మండల అధ్యక్షుడిగా రామచంద్రారెడ్డి అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంపీపీ నారాయణరెడ్డి, గొట్టుకూరు మోహన్ రెడ్డి, తోపుదుర్తి రామాంజి, మంజునాథరెడ్డి, శంకరయ్య, నరేష్, ప్రకాష్ రెడ్డి, మంజునాథరెడ్డి, ఎర్రనాగప్ప, సంగప్ప,అంజి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.పూలమాలలు వేసి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని కాపాడుతానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

భార్యను చంపిన భర్త

విశాలాంధ్ర–బెలుగుప్ప: అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గ పరిధిలోని బెలుగుప్ప మండల పరిధిలోని గంగవరం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు బుధవారం రాత్రి భార్యాభర్తల మధ్య తీవ్ర మనస్పర్ధలు ఏర్పడి గొడవ జరిగిందన్నారు. కోపోద్రిక్తుడైన భర్త రమేష్ భార్యను అతి కిరాతకంగా కర్రతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు గ్రామస్తులు తెలిపారు. మృతురాలి అంజలి మృతదేహాన్ని బెలుగుప్ప పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మట్కా రాకెట్ గుట్టు రట్టు

-8మంది నిందితుల అరెస్టు...
-రూ.12.06లక్షల నగదు స్వాధీనం
-డీఎస్పీ వెంకటశివారెడ్డి

విశాలాంధ్ర–రాప్తాడు: జిల్లాలో మట్కా నిర్వాహకులు, బీటర్లపై జిల్లా ఎస్పీగా కె.కె. అన్బురాజన్ బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే ఉక్కుపాదం మోపారు. మట్కా నిర్వహిస్తూ మట్కా నిర్వహణ గురించి పోలీసులకు ఒక వ్యక్తి ఇచ్చిన సమాచారంతో గుట్టురట్టయింది.అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటశివారెడ్డి పర్యవేక్షణలో ఇటుకలపల్లి సర్కిల్ సీఐ నరేందర్ రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు ఎస్సై పి.వై. ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి గురువారం మధ్యాహ్నం దాడులు చేశారు. రాప్తాడు జాతీయ రహదారి సమీపంలో ఉన్న మేఘన హెూటల్ వెనుక ఉన్న చెట్ల వద్ద మట్కా నిర్వహిస్తున్న 8 మంది ముద్దాయిలను చాకచక్యంగా అరెస్టు చేసి రూ. 12,06,000వేలు నగదు, 7 సెల్ ఫోన్లు, మట్కా చీటీలు, కార్బన్ పేపర్స్, పెన్నులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అనంతపురం రూరల్ డిఎస్పి వెంకటశివారెడ్డి గురువారం మధ్యాహ్నం రాప్తాడు పోలీస్ స్టేషనులో సిఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ ఆంజనేయులుతో కలిసి నిందితుల అరెస్టును, వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండలంలోని చిన్మయ నగర్ కు చెందిన అడబాల శంకరయ్య ఈ నెల 3వతేదీన రాప్తాడు పోలీస్ స్టేషనుకు వచ్చి మట్కా నిర్వహణపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అదేరోజు ఫిర్యాదు ఇచ్చిన శంకరయ్యపై మరో 7మంది తోటి మట్కా నిర్వహకులు కలిసి ఇంటిపై దాడి చేసి మట్కా సమాచారం గురించి పోలీసులకు చెప్తావా అని చంపుతామని బెదిరించి రూ.3000 నగదు కూడా లాక్కుని పారిపోయారన్నారు. కేసును సీరియస్ తీసుకుని 8మంది మట్కా నిర్వహకుల కోసం గాలించి అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండుకు తరలించామన్నారు.

నిందితుల వివరాలు....బెంగళూరులో నివాసం ఉంటున్న అనంతపురం విద్యుత్ నగర్ కు చెందిన కనిగిరి వెంకటేష్, ఆత్మకూరు గ్రామానికి చెందిన పలమాసి అక్కమ్మ, మజ్జిగ అశోక్, రాప్తాడు మండలం కళాకారుల కాలనీకి చెందిన పూజారి గోపాల్, అనంతపురంలోని అరవింద నగర్ సిఎస్ఐ చర్చి సమీపంలో నివాసం ఉన్న పనరాసు కార్తి, గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ఎస్ కు చెందిన షేక్ బడే సాబ్, అనంతపురం పెన్నార్ భవన్ వద్ద ఉన్న అనంతసాగర్ కాలనీ చెందిన కె. సుబ్రహ్మణ్యం ఆచారి, టి.ఆంజనేయులు ఉన్నారు. ముద్దాయిలను అరెస్టు చేసి మట్కా నగదును స్వాధీనం చేసుకున్న రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు, ప్రసాద్, అనిల్, దేవ్లానాయక్, గౌస్, యాసర్, హుమయూన్ బాషా, వేముల నాయుడు, శివ శంకర్ రెడ్డి, జిటి సరోజమ్మలను అనంతపురం జిల్లా ఎస్పీ అభినందించారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి

www.visalaandhra.com

కర్నూలు, శుక్రవారం 06,అక్టోబర్ 2023

చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర-ముదిగుబ్బ : ముదిగుబ్బ మండలం లో ఉన్న చుక్కల భూములను, పరిష్కరించి తక్షణమే అవి రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా, చర్యలు తీసుకొని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు ఆధ్వర్యంలో, గురువారం ముదిగుబ్బ రెవెన్యూ కార్యాలయం వద్ద, మండల డిప్యూటీ తాసిల్దార్ ప్రసన్నకుమార్ కు, మండల సిపిఐ నాయకులు, రైతులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కొన్ని లక్షల పాత పట్టా భూములకు, శాపంగా మారిన 22 ఏచట్టాన్ని ఎత్తివేసి చుక్కల భూములను తక్షణమే రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన రెవెన్యూ అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య,ఆదెప్ప,వెంకటేశ్వర నాయక్,తుమ్మల చిన్నప్ప,రాధాకృష్ణ, లింగప్ప, శంకర, చాంద్బాషా,మహమ్మద్ హుస్సేన్,పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం

విశాలాంధ్ర-రొళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష తో గ్రామీణ ప్రాంతాల పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యం అందిస్తు న్నారని మడకశిర శాసనసభ్యులు డాక్టర్ ఎం.తిప్పేస్వామి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగ నన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో కార్య క్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలో హెుట్టేబెట్ట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా,ఎంపీడీవో కల్లుమ డి ఆజాద్,సిడిపిఓ నాగమల్లేశ్వరి,ఈ.ఓ. ఆర్. డి కృష్ణప్ప, డాక్టర్.బాల ప్రణీత్ రెడ్డి, ఐసి డిఎస్ సూపర్వైజర్ సన్నమ్మ, జే.సి.ఎస్ కన్వీనర్ రంగనపల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షలా మారింది

డెలివరీలకు వచ్చే గర్భవతులను అనంతపురం, బెంగళూరు ప్రాంతాలకు రెఫర్ చేస్తున్న వైనం

విశాలాంధ్ర - హిందూపురం : హిందూపురం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు సరైన వైద్యం అందించాలని, సరైన సిబ్బందిని నియమించాలని గురువారం సిపిఐ హిందూపురం పట్టణ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ, గతనెల బీరేపల్లికి చెందిన చంద్రకళ అనే ఒక మహిళ డెలివరీకి హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రావడంతో, డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మార్గమధ్యంలో చనిపోయిందని, ఆసుపత్రి ముందు బంధువులు కన్నీటి పర్యంతమయ్యారని, ఇలాంటి అభాగ్యులు ఇంకా ఎంతమంది చనిపోవాలని హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వచ్చే రోగులకు సరైన వైద్యం అందడం లేదని, ఉన్న డాక్టర్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదని, డెలివరీల కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తే అనంతపురం, బెంగళూరు వెళ్లాలని రెఫర్ చేస్తున్నారని, లేదంటే హిందూపురంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడే డెలివరీ కావాలంటే నిర్లక్ష్యం వహిస్తున్నారని, డబ్బులు ఇస్తేనే డెలివరీ అనే పరిస్థితి నెలకొన్నదని, ప్రభుత్వ ప్రజాప్రతినిధులు స్పందించాలని సీఎం జగన్ 2019 ఎన్నికల్లో అంబేద్కర్ సర్కిల్లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు లేరని, సక్రమంగా మందులు లేవని, సిబ్బంది కొరత వెంటాడుతున్నదని తమ ప్రభుత్వం వస్తే హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి రూపు రేఖలు మారుస్తానని అంబేద్కర్ విగ్రహం వద్ద చెప్పిన మాటలు ఏమయ్యాయన్నారు. ప్రభుత్వం వచ్చిన ఈ నాలుగున్నర సంవత్సరాలలో ఏం చేశారు, ఓ పి టైం ప్రభుత్వ ఆసుపత్రి నందు ఉదయం తొమ్మిది నుండి ఒంటిగంట సమయం వరకు బోర్డులో ఉన్నప్పటికీ పదిన్నరకు వచ్చి 12 గంటలకే ఓపి క్లోజ్ చేస్తున్నారని, పేదలు ఎక్కడ వెళ్లాలని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి విడుదల రజిని గారు స్పందించి పేదలకు సరైన వైద్యం అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి నందు సిటీ స్కానింగ్ ఏర్పాటు చేయాలని, ఆసుపత్రికి వచ్చిన రోగులు, గర్భవతి మహిళలు ప్రైవేట్ సిటీ స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించి వేలాది రూపాయలు నష్టపోతున్నారని, పేరుకే జిల్లా ఆసుపత్రి సౌకర్యాలు శూన్యమని వెంటనే సిబ్బంది కొరతను తీర్చాలని, సిటీ స్కానింగ్ పునరుద్ధరించాలని, డాక్టర్ల సమయపాలన పాటించాలని, అన్ని రోగాలకు సంబంధించిన మందులు ప్రభుత్వం సప్లై చేయాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లు పాల్గొన్నారు.

అర్హత గల వారందరికీ ఓటును కల్పిస్తాం

విశాలాంధ్ర-ధర్మవరం : నియోజకవర్గంలోని అర్హత గల వారందరికీ తప్పనిసరిగా ఓటు హక్కును కల్పిస్తామని ఆర్డిఓ తిప్పే నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం సాయంత్రం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు ఇచ్చిన సలహాలు సూచనలను ఆర్డిఓ దృష్టికి తీసుకొని వచ్చారు. ఇందులో భాగంగా గతంలో తాము ఓటు తప్పిదాలపై వినతి పత్రాలు ఇచ్చామని, ఆ సమాచారం పై మాకు సమాధానం కావాలని తెలిపారు. స్పందించిన ఆర్డీవో మాట్లాడుతూ మీ ఫిర్యాదుల మేరకు విచారణ నిష్పక్షపాతంగా కొనసాగిస్తున్నామని, అందరికీ న్యాయం జరిగేలా, అర్హత గల వారందరికీ ఓటు హక్కు కలిగేలా గట్టి చర్యలు తప్పక తీసుకుంటామని తెలిపారు. బిఎల్వోలు కూడా ఫారం-6 ఫారం- 7 లను భర్తీ చేసేటప్పుడు అతి జాగ్రత్తగా, పారదర్శకంగా తమ విధులను నిర్వర్తించేలా చర్యలు చేపడతామని తెలిపారు. అదేవిధంగా బిఎల్వోలు ఎవ్వరు కూడా ప్రజా ప్రతినిధుల వద్ద వివిధ రాజకీయ పార్టీల ఇళ్లకు వెళ్లరాదని, అలా వెళ్ళిన సమాచారం మాకు తెలిసినచో కలెక్టర్ ఆదేశాల మేరకు బిఎల్ఓ లపై కఠిన చర్యలతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ యుగేశ్వరి దేవి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేతనాల కోసం స్వచ్ఛ కార్మికుల రాస్తారోకో

విశాలాంధ్ర - ఓబుల దేవర చెరువు : ఓడి చెరువు మండల కేంద్రానికి చెందిన స్వచ్ఛ భారత్ కార్మికులు తమకు పది నెలలుగా జీతాలు రాలేదంటూ కదిరి హిందూపురం ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిం చారు. వీరికి సీఐటీయూ పార్టీ నాయకులు పలికారు. సిఐటి నాయకులు శ్రీరాములు, కుళ్లాయప్ప మాట్లాడుతూ పారిశుద్ధ కార్మి కుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించా లని డిమాండ్ చేశారు. వారు అనునిత్యం కష్టపడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్న అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు వారికి పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని ఆందోళన కారులను పోలీస్ స్టేషన్కు తరలించారు.

7న డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం డిపో బస్సుల రవాణా సమస్యల పైన ఏమైనా సలహాలు, సూచనల పైన ఈ నెల 7వ తేదీ ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు డిపో మేనేజర్ మోతిలాల్ తో డయల్ యువర్ ఆర్టీసీ డిఎం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మోతిలాల్ తెలిపారు.వారు మాట్లాడుతూ ప్రయాణికుల కొరకు ఆర్టీసీ సంస్థ ఉందని తెలిపారు. సుఖవంతమైన ప్రయాణం కొరకు ఆర్టీసీ కృషి చేస్తుందని తెలిపారు.డిపో మేనేజర్ సెల్ నెంబర్ 9959225859 కు కాల్ చేసి మాట్లాడవచ్చునని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర-ధర్మవరం: ఇంటితోపాటు చుట్టుపక్కల గల పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పంచాయతీ కార్యదర్శి యల్ల ప్ప పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం మండల పరిధిలోని రావులచెరువు పంచాయితీ ఆఫీసులో సర్పంచ్ సాకే హైమావతి ఆధ్వర్యంలో స్వచ్ఛత ఏక్ సంకల్పం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ, మానవహారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రధాన కూడలి వద్ద, పాఠశాల ఆవరణం వద్ద శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, హైస్కూల్ విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం

విశాలాంధ్ర-ధర్మవరం : విద్యార్థులకు మంచి భవిష్యత్తుకు పునాది ఉపాధ్యాయులే వేస్తారని గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల పౌర శాఖ గ్రంథాలయంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను పాఠకులు, విద్యార్థులు నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూరి వేసి నివాళులు అర్పించారు. అనంతరం అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల పాత్ర విద్యార్థులకు ఎంతో కీలకపాత్రగా ఉన్నారని, పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దే శక్తి ఒక్క ఉపాధ్యాయునికే కలదని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణ నాయక్, గంగాధర్, అధిక సంఖ్యలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల పట్ల యువకులు ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు : క్రీడల పట్ల విద్యార్థులు యువకులు ఆసక్తి పెంచుకోవాలని వైయస్సార్సీపి సీఈసీ సభ్యులు కొత్తకోట సోమశేఖర్ రెడ్డి తనయుడు వైసీపీ యువ నాయకులు చక్రధర్ రెడ్డి తెలిపారు. కొత్త చెరువులోనే సత్యసాయి జూనియర్ కళాశాల మైదానంలో వైయస్సార్ మెమోరి యల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి సోమశేఖర్ రెడ్డి సెప్టెంబర్ 8వ తేదీ జన్మదిన సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గ వ్యాప్తంగా 6 మండలాల్లోనూ ఈ క్రికెట్ టోర్నమెంట్లను ప్రారంభించామన్నారు. కొత్తచెరువు మండలంలో 25 టీములు పాల్గొన్న అన్నారు. గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్లో ఇండియన్ జూనియర్ టీం ఇండియన్ సీనియర్ టీం తలపడ్డాయి. ఇందులో జూనియర్ టీం 97రన్నులు చేయగా సీనియర్స్ టీం 98 రన్లు సాధించి విజయం సాధించారు. గెలుపొందిన వారికి తగిన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండ్ మాజీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, వార్డు మెంబర్ సాలమ్మ గారి శివ, వైసిపి నాయకులు బాలచంద్రారెడ్డి, రామచంద్ర, పాపన్న, సుహల్ పాల్గొన్నారు.

వలసలు ఆపడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

విశాలాంధ్ర - పుట్టపర్తి : రైతులను వ్యవసాయ కూలీలను వలసలు వెళ్లకుండా ఆపడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యా యని సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్, వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్య దర్శి కేశవరెడ్డి పేర్కొన్నారు. గురువా రం గణేష్ కూడలిలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నెల 17వ తేదీ ఉదయం 11 గంటలకు సంగమేశ్వర ఫంక్షన్ హాల్ నందు రాష్ట్ర సదస్సు నిర్వహించడం జరుగుతుంద న్నారు.వ్యవసాయ పనులు లేక గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ కూలీలకు, చేతి వృత్తుల వారికి ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వాలు వెంటనే వారికి చేయూతనందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని ప్రభుత్వాలు గానీ అధికారులు గానీ కరువు పరిస్థితులను అంచనా వేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు అన్నారు. కరువు నుండి వ్యవసాయ కూలీలను పేదలను రైతులను ఏ విధంగా ఆదుకోవాలో ప్రభుత్వాలు ఎలాంటి ప్రణాళికలు రూపొందించ లేద న్నారు. తక్షణమే కరువు పరిస్థితుల నుండి వ్యవసాయ కూలీలను రైతు కుటుంబాలను ఆదుకోవడానికి తక్షణమే కరువు పరిస్థితుల అంచనా వేసి కరువు మండలా లుగా ప్రకటించే ప్రతి పేద కుటుంబానికి నెలకు పదివేల రూపాయలు కరువు పెన్షన్ తో పాటు ప్రతి నెల 35 కేజీల బియ్యం నిత్యవసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలన్నారు. రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలు రద్దుచేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. ఈనెల 17వ తేదీ అనంతపురం నగరంలో జరిగే రాష్ట్ర సదస్సుకు అన్ని జిల్లాల నుంచి నాయకులు కార్యకర్తలు ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు. నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు వెంకటనారాయణ, కుళ్లాయప్ప, జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి, జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరమ్మ, జిల్లా నాయకులు చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి దాతల సహకారం

విశాలాంధ్ర-పెనుకొండ: మండల పరిధిలోని గుట్టురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ యాక్టివిటీ కింద ఉన్నత పాఠశాలకు మరియు ప్రైమరీ పాఠశాలకు మౌలిక వసతులు కల్పించడానికి హుందాయి కంపెనీ 35 లక్షల రూపాయలు వెచ్చించడానికి దాతలు ముందుకు వచ్చారని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగార్జునుడు తెలిపారు. హుండ్యే కంపెనీ ఎండి జై మాన్ కిమ్, డైరెక్టర్ అండ్ సి ఎఫ్ ఓ హాసిన్‌లి, రీజినల్ మేనేజర్ దేవనేసన్, కంపెనీ ప్రతినిధులు ఆనంద, వెంకటరమణ, పాఠశాలను సందర్శించి మొక్కలు నాటి పాఠశాలకు అవసరమైనటువంటి మౌలిక సదుపాయాలు కల్పించుటకు పాఠశాలల నుంచి వారు విన్నపం తీసుకున్నారు. పాఠశాలకు లైబ్రరీ బుక్స్ ల్యాబ్ మెటీరియల్ కిచెన్ షెడ్ స్టేజి హ్యాండ్ వాష్ సోలార్ ప్లాంట్ సేఫ్టీ గ్రిల్ తదితర పనులు చేయించడానికి అంగీకారం తెలిపినట్లు తెలిపారు. వారుస్కూలు సందర్శనలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రంగస్వామి, సర్పంచ్ నాగరత్నమ్మ, జడ్పిటిసి శ్రీరాములు, ఎంపిటిసి నిర్మల, ఎస్ఎంసి చైర్మన్ నజీర్, పాల్గొని అతిథులను సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కోసం సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ పాఠశాలను ఎంచుకోవడం చాలా సంతోషంగా ఉందని దాతలు తెలిపారు.

చంద్రబాబును విడుదల చేయాలి

విశాలాంధ్ర-ముదిగుబ్బ : చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నిరసనగా,ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాలతో ముదిగుబ్బ పట్టణంలోని 3,4 వ వార్డుల నందు, బాబుతో నేను కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు తుమ్మల మనోహర్ మాట్లాడుతూ 40 సంవత్సరాలకు పైగా స్వచ్ఛమైన, మచ్చలేని ప్రజాసేవ చేసిన నారా చంద్రబాబునాయుదు ని, ఈ సైకో వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా, అక్రమంగాఅరెస్ట్ చేసిన తీరును,ప్రజలకు వివరిస్తూ 92612 92612 అనే నెంబర్కు,మిస్డ్ కాల్ ఇచ్చి తెలుగుదేశం పార్టీకి, నారా చంద్రబాబునాయుడుకు, అండగా నిలవాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు తుమ్మల మనోహర్,కృష్ణమూర్తి యాదవ్, చికెన్ తిరుపాల్, నారాయణస్వామి, రాధమ్మ, రంగనాయకులు, రియాజ్ భాష, అయూబ్ ఖాన్, ప్రతాప్, కృష్ణ, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర-ఒడిసి రూరల్ : పౌష్టిక ఆహారం తోనే గర్భవతులు ఆరోగ్యంగా ఉంటాలని ప్రత్యేక అధికారి రమేష్ తెలిపారు. గురువారం మాసోత్సవాల కార్యక్రమం భాగంగా గౌనిపల్లి సెక్టర్ సంబంధించి గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో పౌష్టికాహార ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రదర్శనను మండల ప్రత్యేక అధికారి రమేష్, ఎంపీపీ తుమ్మల పర్వీన్ షామీర్ ఎంపీడీవో వరలక్ష్మి, తహసిల్దార్ రామ్నాథ్ రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ విజయ కుమారి, ఈ సందర్భంగా పౌష్టికాహారం వల్ల గర్భవతులకు బాలింతలకు జరిగే లాభాల గురించి సూపర్వైజర్ విజయ్ కుమారి వివరించారు. ప్రదర్శన కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ భాను ప్రకాష్ నాయక్, డాక్టర్ కమల్, షేక్ షమీం, స్వర్ణలత, సుకన్య ,వెంకటనరసమ్మ, పార్వతి, ప్రమీల, ఆరోగ్యకార్యకర్త అశ్విని, తదితర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

విశాలాంధ్ర-పుట్టపర్తి : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం టిడిపి కార్యాలయం ముందు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును అక్రమ రిమాండ్‌ను నిరసిస్తూ చేపట్టిన నిరాహార దీక్షలు 23వ రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పల్లె మాట్లాడుతూ అతి త్వరలో ఖచ్చితంగా జైలు నుంచి విడుదలవుతారని ధీమా వ్యక్తం చేశారు. దీక్ష శిబిరంలో తెలుగుదేశం నాయకులందరితో కలిసి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మేళం, సన్నాయి, కొమ్ము వాయించి విన్నూతన రీతిలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సైకో పోవాలి సైకిల్ రావాలి, జగన్మోహన్ రెడ్డి డౌన్ డౌన్, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నిరసనలు చేస్తూ మేళం, సన్నాయి, కొమ్మును వాయించారు. ఈ కార్యక్రమంలోజిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, శ్రీరాంరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్వారణాల చెరువు కుంట పరిశీలిన

విశాలాంధ్ర-ఎన్‌పీకుంట: మండల పరిధిలోని పి కొత్తపల్లి పంచాయతీ దండే వారి పల్లి సమీపంలో ఉన్న ద్వారణాల చెరువు కుంటను గురువారం మండల తహసిల్దార్ నరేంద్ర కుమార్ పరిశీలించారు. చెరువు కుంట ఆక్రమణ పై చీమలచెరువు పల్లి రైతుల ఫిర్యాదు మేరకు చెరువుకుంటను పరిశీలించి ఆక్రమించుకున్న రైతులను పిలిపించారు. చెరువులోకి వేసిన మట్టిని, రాళ్ళను వెంటనే తొలగించే విధంగా చూడాలని రైతులకు తహసిల్దార్ సూచించారు. అక్రమంగా వేసిన రాళ్లను శుక్రవారంలోగా బయటికి తరలిస్తామని అధికారులకు రైతులు విన్నవించారు. చెరువుకు సంబంధించిన భూమిలో కబ్జా చేసుకుని పంట వేసిన పొలాన్ని సైతం వదిలివేయాలని రైతు పెద్ద రెడ్డప్పకు సూచించారు. పంట అయిపోయిన తర్వాత చెరువు హద్దుల వరకు వదిలివేస్తానని లిఖిత పూర్వకంగాతోటి రైతులకు హామీ ఇచ్చారు.ద్వారణా ల చెరువు కుంట సర్వేనెంబర్ 60 లో 16 ఎకరాల 68 సెంట్లు విస్తీర్ణం లో ఎలాంటి ఆక్రమణ చేయకూడదని రెవెన్యూ అధికారులు చీమలచెరువు పల్లి రైతులకు తెలియజేశారు. తహసిల్దార్ తో పాటు వీఆర్వో శకుంతల,రైతులు రవీంద్రారెడ్డి, మాకిరెడ్డి ,నారాయణరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

దాతల దాతృత్వం మరువలేనిది

విశాలాంధ్ర-గోరంట్ల : దాతల దాతృత్వం మరువలేనిదని మండల విద్యాధికారి గోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా దిగువ గంగంపల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషులు నారాయణస్వామి సతీమణి నంజమ్మ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని వారి కుమారుడు పాకాల సర్కిల్ ఇన్స్పెక్టర్ గౌని ఓబులేసు తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా డి గంగంపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాదాపు 20 వేలకు పైగా వెచ్చించి, నోట్ పుస్తకాలు, పెన్నులు, వాటర్ బాటిల్లు తదితర విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు.ప్రదానోపాధ్యాయులు సుధాకర్ నాయక్, విద్యాకమిటీ చైర్మన్ బయప రెడ్డినారాయణరెడ్డి,కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురువు లేని సమాజాన్ని ఊహించలేం

విశాలాంధ్ర - ధర్మవరం : గురువు లేని సమాజాన్ని ఊహించలేమని, గురువుతోనే సమ సమాజం ఏర్పడుతుందని విశ్వభారతి స్కూల్ కరెస్పాండెంట్ షేకూన్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ప్రపంచ (అంతర్జాతీయ) ఉపాధ్యాయ దినోత్సవం విద్యార్థులు నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. తదనంతరం ఉపాధ్యాయులతో కలిసి కేకును కట్ చేసి, వేడుకలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రపంచంలో మలితరాలకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దే శక్తి కేవలం ఉపాధ్యాయునికే ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజ్వాన్ భాషా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయండి

విశాలాంధ్ర - ధర్మవరం : కళాశాల నిర్మాణ పనులలో భాగంగా నాడు- నేడు పథకంలోని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డివిఈవో రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు ప్రభుత్వ బాలికల కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తదుపరి కళాశాలలోని వివిధ రకాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థినీలతో నేరుగా మాట్లాడి విద్యా బోధన తీరును అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులతో సమావేశమై విద్య బోధన యొక్క తీరు తేన్నలులను గూర్చి వారి వివరించారు. కళాశాల విద్యార్థులందరూ కూడా కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి ఉత్తీర్ణత శాతాన్ని సాధించాలని, తద్వారా కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు.గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం మరింత మార్కులతో ముందుకు రావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ట్యాబ్ లలో సాఫ్ట్వేర్ మార్చరాదు

విశాలాంధ్ర-ధర్మవరం : ప్రభుత్వం ద్వారా విద్యార్థులకు అందజేసిన జగనన్న ట్యాబులలో సాఫ్ట్ వేరు బై జ్యూస్ యాపులను తొలగించి వేరే సాఫ్ట్వేర్ను వేయరాదని మొబైల్ సెంటర్ నిర్వాహకులకు వన్టౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వన్టౌన్ పోలీస్ స్టేషన్లో పట్టణ మొబైల్ సెంటర్ నిర్వాహకులకు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల జగనన్న ట్యాబులలో వేరే సాఫ్ట్వేర్ను వేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కొంతమంది విద్యార్థులు మొబైల్ సెంటర్లకు వచ్చి సాఫ్ట్వేర్ మార్పించుకోవడం గేమ్స్ ఎక్కించుకోవడం తదితర అవసరమైన వెబ్సైట్లు వేయించుకోవడం జరుగుతోందని తెలిపారు. మొబైల్ షాపులు వద్దకు ఎవరైనా విద్యార్థులు వస్తే మాకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాబు కోసం నేను సైతం

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలోని వారపు సంతలో గురువారం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మా బాబు కోసం నేను సైతం అంటూ కరపత్రాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని జగన్మోహన్ రెడ్డి అధికార అహంకారంతో విర్రవీగుతున్నాడని అధికార అహంకారానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడుతున్నాయని 40 సంవత్సరాలు మచ్చలేని ప్రజా సేవ చేసిన నారా చంద్రబాబు నాయుడుని ఈ సైకో వైసీ ప్రభుత్వం అన్యాయంగా అక్రమంగా అరెస్టు చేసిన తీరును ప్రజలకు 9261292612 నెంబర్ కు మిస్డ్ కాల్ ఇచ్చి చంద్రబాబు నాయుడికి సంఘీభావం తెలియజేయాలని ఆమె ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటరమణ, మాజీ సింగల్ విండో అధ్యక్షులు డివి ఆంజనేయులు, నీరుగంటి చంద్ర, సిపిఐ నాయకులు సాయి నగర్ చాంద్బాషా,మాజీ ఎంపీటీసీ అమర్నాథ్,టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పేదలపైన పోలీసుల జులుం

విశాలాంధ్ర - చిలమత్తూరు : ఇంటి పట్టాలు ఇస్తామని నమ్మించారు. తీరా ఇళ్ళ నుండి గెంటేసి, ఉన్న గుడెసెలను కూల్చేశారు. అంటూ అనంతపురం జిల్లా చిలమత్తూరు మండలం కోడూరు గ్రామం రెవెన్యూ పొలం సర్వే నెంబర్ - 805లో నివసిస్తున్న పేదలు విలపించారు. గుడిసెలు వేసుకున్న చోటే ఇంటి పట్టాలు ఇస్తామని నమ్మించారని, తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న పేదలకి హామీ ఇచ్చారని వారు తెలిపారు. శాంతియుతంగా ఉండమని, ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పిన అధికారులను నిజం అని పేదలు నమ్మారు. మీరు పట్టాలు ఇచ్చేవరుకు మేము గుడిసెలలో ఉంటామంటే అలాగే అన్నారు. నమ్మి గుడిసెల్లో ఉంటున్న పేదలపై ఒక్కసారిగా గురువారం ఉదయం 100 మంది పోలీసులతో దాడి చేశారు. మహిళలని చూడకుండా ఈడ్చి పడేశారు. భారీ తోపులట నడుమ సిపిఎం నాయకులను, మహిళలను అరెస్టు చేసి లేపాక్షి పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఒక్కసారిగా గుడిసెలను జేసిబీలతో మట్టం చేశారు. గుడిసెలలో పేదలకు సంబందించిన మంచాలు, వస్తువులు చిందరా బందరా చేశారు. 'సార్ మాకు నీడ లేదు.. ఉన్న గుడిసెను పీకేయడం సరికాద'ని ప్రాధేయపడ్డారు. ఇంటి పట్టాలు ఇస్తామన్నా మీరే గుడిసెలు పీకేయడం సరికాదని అన్నారు. అయిన కాకీలు కరగలేదు. తహశీల్దార్ కనికరించలేదు. మీకు పేదలపై అక్కసు ఎందుకు అని సిపిఎం నాయకులు నిలదీశారు. శాంతియుత ఉద్యమంపై ఇందుకు ఇంతగా ఇరుచుకుపడుతున్నారని ప్రశ్నించారు. పెద్ద పెద్ద భూస్వాములకు సేవ చేస్తూ పేదల కడుపు కొడుతున్న తహశీల్దార్ ని సస్పెండ్ చేయాలన్నారు. సెంటిన్నర భూమి కూడా ఇవ్వలేని ప్రభుత్వం ఓ ప్రభుత్వమేనా అన్నారు. ఈ నిరుకుశత్వ వైఖరితో ఎన్నో రోజులు పరిపాలన చేయలేదని హెచ్చరించారు. స్థానిక వైసిపి నాయకులు 805 సర్వే నెంబర్ భూమిని కబ్జాచేయాలన్న ఉద్దేశ్యంతోనే ఇంత బలగాన్ని రంగంలోకి దింపారని అన్నారు. ప్రశ్నించేవారిని పేదల మద్దతుగా నిలిచేవారిపై అక్రమంగా కేసులు పెట్టడం,అరెస్టు చేయడం ఈ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని అన్నారు. ఆ పేదలే మీకు ఓట్లు వేయాలన్నాది తెలుసుకోవాలన్నారు. ప్రజా వ్యతిరేఖ విధానాలను అవలంబిస్తూ ఇలాంటి చర్యలు చేపట్టడం దారుణం అన్నారు. అరెస్టు ల సందర్భంగా గుడిసెలలో ఏర్పాటు చేసుకున్న గాంధీ పోటోను లాగి పడేశారు. తోపులటాలో మహిళలకు రక్తగాయాలు అయ్యాయి. పేద మహిళలను, నాయకులను వాహనాలకు వేసి పోలీస్ స్టేషన్ కి తరలించారు. అరెస్టు అయిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి వెంకటేష్,అధ్యక్షుడు లక్ష్మినారాయణ, సిఐటీయు జిల్లా నాయకులు రమేష్,కమిటి సభ్యులు శివ, రహంతుల్లా, చరణ్, నరసింహా, సదాశివరెడ్డి, రాజు, మంజు తదితరులు పాల్గొన్నారు. అక్రమ అరెస్టులను ఖండిస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద పేదలు ఆందోళన చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, జీఎల్ నరసింహులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు.